# సాక్షి కామారెడ్డి

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024






**రుణమాఫీ అమలు చేయాలి**

పంట రుణాల మాఫీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

- 9లో ▸



**ఫిర్యాదులను పరిష్కరించాలి**

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.8 /18.8

**వాతావరణం**

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### 'మల్బరి సాగు లాభదాయకం'



**భిక్కనూరు:** మల్బరి సాగు, పట్టుపురుగుల పెంపకంతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం జంగంపల్లిలోని రైతు వేదికలో నిర్వహించిన మల్బరి సాగుపై అవగాహన సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్బరి సాగుతో రైతుకు 20 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. మల్బరి సాగు గురించి సెంట్రల్ సిల్క్ బోర్డు సాంకేతిక అధికారి రాఘవేందర్‌రావు వివరించారు. సెరీకల్చర్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీల గురించి పట్టు పరిశ్రమ జిల్లా అధికారి జ్యోతి వివరించారు. గ్రామస్థాయిలో కమిటీలను వేసి మల్బరి పంట సాగు పెరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారులు ఐలయ్య, రాజయ్య, టెక్నికల్ అసిస్టెంట్ నాగేందర్‌రావు, ఈవో లిఖిల్‌రెడ్డి, తెయూ సౌత్‌క్యాంపస్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

### ఆవాస ప్రాంత పాఠశాల ప్రారంభం



**రామారెడ్డి:** ఉప్పల్‌వాయి ఇటుక బట్టీలో సోమవారం డీఈవో రాజు ఆవాస ప్రాంత పాఠశాలను ప్రారంభించారు. పది మంది బడీడు పిల్లలకోసం ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. వారిని తప్పనిసరిగా బడికి పంపించి చదివించాలని డీఈవో తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి వేణు శర్మ, మండల విద్యాధికారి ఆనంద్‌రావు, టీచర్ సతీష్, ఇటుక బట్టీ యజమాని గోవింద్, విద్యా వాలంటీర్ స్వప్న పాల్గొన్నారు.

### 'పెంచిన ఇంటి పన్నులను వసూలు చేయొద్దు'



**బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో మధ్య తరగతి కుటుంబాలకే పన్నులు పెంచి, మిగతా వారికి ఇప్పటి వరకు పన్నులు పెంచలేదని బీజేపీ నేతలు పేర్కొన్నారు. అందరికీ ఒకేలాగా పెంచే వరకు పన్నుల వసూలును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గుడుగుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పన్నుల విషయమై పలు మార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అందరికి పన్నులు ఒకేవిధంగా ఉండాలని, లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోనాల గంగారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 'భవన ప్రారంభోత్సవానికి తరలిరావాలి'



**కామారెడ్డి రూరల్:** హైదరాబాద్‌లోని కోకాపేటలో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవనాన్ని ఈనెల 14న ప్రారంభించనున్నట్లు కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్కంటి భూమన్న తెలిపారు. జిల్లాలోని కురుమలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం ఇల్చిపూర్‌లోని సరస్వతి దేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కురుమల సమాయత్తపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుమలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఉన్న అన్ని స్థానాల్లో పోటీచేసి రాజకీయంగా ఎదగాలని సూచించారు. భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కురుమ సంఘం ప్రతినిధులు మర్కంటి బుచ్చన్న, బెల్లపు చంద్రం, ముత్యం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# 'సమీకృతం'.. అసమగ్రం!

పాలనను ప్రజలకు చేరువ చేయడానికి ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు సమీకృత కార్యాలయాల భవనాలను నిర్మించింది. అయితే భవనం నిర్మించారే తప్ప అవసరమైన ఫర్నిచర్, పార్టిషన్‌కు నిధులు ఇవ్వకపోవడంతో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది బీరువాలు, పరదాలతో క్యాబిన్‌లను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- కలెక్టరేట్‌లో సమస్యలు
- పలు శాఖలకు క్యాబిన్ల కరువు
- పరదాలు, బీరువాలే అడ్డుగోడలు
- ఏళ్లు గడుస్తున్నా మెరుగుపడని సౌకర్యాలు
- పార్టిషన్ లేక ఇబ్బందిపడుతున్న సిబ్బంది



పౌరసరఫరాలు, ఆరోగ్యశ్రీ విభాగాల మధ్య పార్టిషన్ కోసం అడ్డుగా ఉంచిన బీరువాలు



ఆడిట్ శాఖ కార్యాలయంలో..


2016 అక్టోబర్ 11న కామారెడ్డి జిల్లా ఏర్పాటైంది. కలెక్టరేట్ కార్యాలయాన్ని మైనారిటీ గురుకుల పాఠశాల భవనంలో ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఎస్టీ కాలేజీ విద్యార్థి వసతి గృహం భవనంలో ఏర్పాటు చేశారు. జిల్లా ఏర్పాటైన ఏడాదికి అంటే 2017 అక్టోబర్ 11న జిల్లా సమీకృత కార్యాలయాల భవనం, జిల్లా పోలీసు కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2021 జూన్ 20న అప్పటి సీఎం కేసీఆర్ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల భవనాలను ప్రారంభించారు.

**మూడున్నరేళ్లు గడిచినా..**

కలెక్టరేట్ ప్రారంభించి మూడున్నరేళ్లు గడిచినా ఆయా శాఖల్లో పార్టిషన్ జరగకపోవడం విస్మయం కలిగిస్తోంది. ఆయా కార్యాలయాల్లో సిబ్బంది కూర్చున్న చోటుకు కంప్యూటర్లకు కరెంటు కనెక్షన్ ఇవ్వడానికి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో కొన్ని శాఖల్లో వైర్లను నేలపై పరిచి టేపులు అతికించారు. మరికొన్ని శాఖల్లో పైపులు వేసి వాటి నుంచి వైర్లను లాగారు. అటూ ఇటూ నడిచేప్పుడు వైర్లు, పైపులు కాళ్లకు తగిలి సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. కలెక్టరేట్‌లో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నేలపై విద్యుత్ వైర్లు





కార్మిక శాఖ కార్యాలయంలో..

### సౌకర్యాలు లేక..

కలెక్టరేట్ భవనంలో ఆయా శాఖలకు కేటాయించిన గదుల్లో కొన్ని శాఖల్లో ముఖ్య అధికారికి గది ఉండగా, మిగతా అధికారులకు గదులు లేవు. ఇంకొన్ని శాఖల్లో జిల్లా స్థాయి అధికారికి కూడా ప్రత్యేక గది లేదు. భవన నిర్మాణ సమయంలో ఫర్నిచర్, పార్టిషన్, ఇతర సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించకపోవడంతో చాలా శాఖలు పార్టిషన్ చేసుకోలేకపోయాయి. నిధులు ఉన్న కొన్ని శాఖలు పార్టిషన్ చేయించుకున్నాయి. మిగతా శాఖల అధికారులు, సిబ్బంది వరుసగా కుర్చీలు, టేబుళ్లు వేసుకుని విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ, డీఆర్డీవో తదితర శాఖలకు మాత్రమే క్యాబిన్‌లున్నాయి. పంచాయతీ శాఖ, విద్య, వైద్యారోగ్య శాఖ, పౌరసరఫరాల శాఖ, కార్మిక, ప్రణాళిక, ఆడిట్, సంక్షేమ శాఖలకు పార్టిషన్ లేకపోవడంతో సిబ్బంది పడుతున్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తమ సెక్షన్ల మధ్య బీరువాలు అడ్డుపెట్టుకుని, పరదాలు కట్టుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు.

### ఎండలోనే వాహనాల పార్కింగ్

కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందికి సంబంధించిన కార్లు, బైక్‌లు నిలపడానికి అప్పట్లో సోలార్ ప్లేట్లతో కూడిన పార్కింగ్ షెడ్ మంజూరు చేశారు. అయితే ఇప్పటికీ పనులు చేపట్టలేదు. దీంతో వాహనాలన్నీ ఎండకు ఎండుతున్నాయి. వానకు తడుస్తున్నాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారుల వాహనాల పార్కింగ్‌కు కూడా షెడ్లు నిర్మించలేదు. దీంతో అన్ని వాహనాలు ఎండలోనే ఉంటున్నాయి. ఎండకు ఎండి, వానకు నాని వాహనాలు దెబ్బతింటున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోలార్ ప్లేట్లతో పార్కింగ్ షెడ్ నిర్మాణానికి సంబంధించి పనులు చేపడితే పార్కింగ్ సమస్యతో పాటు విద్యుత్ బిల్లుల సమస్యకూ పరిష్కారం దొరుకుతుందని పేర్కొంటున్నారు.



కలెక్టరేట్ ఆవరణలో ఎండలో వాహనాలు



ఎక్సైజ్ కార్యాలయానికి కర్టెనే గోడ



ఓపెన్ హాల్‌లో విద్యాశాఖ కార్యాలయం

### దత్తాత్రేయుడిని ఆరాధించాలి



**ఎల్లారెడ్డిరూరల్:** భక్తులు ఎల్లవేళలా దత్తాత్రేయుడిని ఆరాధించాలని, దీని వల్ల కష్టాలు దరిచేరవని బర్దిపూర్ పీఠాధిపతి సిద్దేశ్వర గిరి పేర్కొన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ శివారులోని దత్త పీఠంలో దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చెప్పారు. పీఠం సభ్యులు తులసి తదితరులు ఉన్నారు.

### ఘనంగా సోనియా జన్మదినం



**కామారెడ్డి టౌన్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు అశోక్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీలో మనోళ్లు

- హక్కుల కోసం నినదించిన కేవీఆర్
- సీఎంను అభినందించిన పోచారం, మదన్‌మోహన్‌రావు

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** అసెంబ్లీ శీతాకాల సమావేశాల ప్రారంభం రోజున జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హక్కుల కోసం నినదించారు. నియోజకవర్గంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలను సభ దృష్టికి తీసుకువెళ్లడానికి ఏకంగా శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి సీట్లో కూర్చున్నారు. దీనిపై మంత్రులు కల్పించుకుని, తర్వాత మాట్లాడుదామని సర్ది చెప్పారు. అనంతరం ఆయన తమ నియోజక వర్గంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ప్రివిలేజ్ కమిటీకి ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించాలని, ఆ విషయమై సభలో మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావులు సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తూ మాట్లాడారు.

# 'ఇందిరమ్మ' సర్వేకు ససేమిరా!

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించే సర్వేను చేపట్టడానికి పంచాయతీ కార్యదర్శులు విముఖత చూపుతున్నారు. ఎవరి దరఖాస్తైనా తిరస్కరణకు గురైతే తాము ఇబ్బందిపడాల్సి వస్తుందని వెనుకంజ వేస్తున్నారు. సర్వే బాధ్యతలను వేరేవారికి అప్పగించాలని అధికారులను కోరుతున్నారు.

- వెనుకంజ వేస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- అధికారులకు వినతిపత్రాల అందజేత



డీపీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

**నాగిరెడ్డిపేట:** పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 మందిని ఎంపిక చేసి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల చొప్పున విడతలవారీగా అందించనుంది. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి పంచాయతీ కార్యదర్శులు సర్వే చేయాలని సూచించింది. ఇప్పటికే వారికి శిక్షణ కూడా ఇచ్చారు. సోమవారం సర్వే ప్రారంభమైంది. అయితే సర్వే చేయడానికి చాలామంది పంచాయతీ కార్యదర్శులు సుముఖంగా లేరు. తాము సర్వే చేయబోమంటూ మండలాధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. ఇప్పటికే ఉన్న పనిభారంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక బాధ్యత తమపై పెడితే భవిష్యత్తులో తాము క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడానికి ఇబ్బందిపడాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు.

**వరుస సర్వేలు..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా సర్వేలు చేయిస్తోంది. ఇప్పటికే మిషన్ భగీరథ ఇంటింటి సర్వే, ఎల్ఆర్ఎస్ సర్వే, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తదితర సర్వేలు చేయించింది. ఇప్పటికే పనిభారంతో సతమతమవుతున్న పంచాయతీ కార్యదర్శులు.. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కూడా అప్పగించడంతో మరింత ఇబ్బందిపడుతున్నారు. ఈ సర్వే చేయలేమని చెప్పడానికి వారు కారణాలు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులలో ఏవైనా తిరస్కరణకు గురైతే దరఖాస్తుదారులు తమపై కక్ష పెంచుకునే అవకాశాలుంటాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఇళ్ల సర్వేకు తమను దూరంగా ఉంచాలని కోరుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను గ్రామాల్లో ఇటీవల ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలకు అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### అదనపు పనిభారం తగ్గించండి

**కామారెడ్డి అర్బన్:** ఇతర శాఖల పనులు, సర్వేలు వంటి అదనపు పనుల నుంచి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ విషయమై ఫోరం ప్రతినిధులు సోమవారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేనుంచి తమను పూర్తిగా తప్పించాలని కోరారు. సెలవు రోజుల్లో పనులు చేయిస్తే అందుకు అదనంగా సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

# 'సమగ్ర శిక్ష'లో సమ్మె సైరన్

- డిమాండ్ల సాధన కోసం పోరుబాట
- నేటి నుంచి నిరవధిక సమ్మెలోకి ఉద్యోగులు

**కామారెడ్డి టౌన్:** విద్యా శాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్లను సాధించుకోవడం కోసం నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. నిరసనలతో సర్కారులో కదలిక రాకపోవడంతో మంగళవారంనుంచి సమ్మె బాట పడుతున్నారు. ఇప్పటికే అధికారులకు సమ్మె నోటీసు అందించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2006లో సమగ్ర శిక్ష అభియాన్ ఏర్పాటయ్యింది. జిల్లాలో కేజీబీవీ బోధనేతర, బోధన సిబ్బంది 480, యూఆర్ఎస్, బోధనేతర సిబ్బంది 10, డీపీవో సిబ్బంది 7, ఎంఐఎస్ సమన్వయకర్తలు 22, సీపీవోలు 22, సీఆర్పీలు 76, ఐఈఆర్పీలు 26, మెసెంజర్లు 18, పీటీఐలు 71, సీజీవీలు 18 మంది మొత్తం 750 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. విద్యాశాఖ పర్యవేక్షణలో వీరంతా సేవలందిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న వీరు.. విద్యాశాఖలో విలీనం చేసి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఏళ్లుగా కోరుతున్నారు. ఈ డిమాండ్‌తో గతేడాది సమ్మె కూడా చేశారు. అప్పట్లో వీరి సమ్మెకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ హామీ నెరవేరకపోవడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు మళ్లీ సమ్మె బాటపట్టారు.



డీఈవోకు సమ్మె నోటీస్ ఇస్తున్న ఉద్యోగులు (ఫైల్)

### ప్రధాన డిమాండ్లు..

- సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి. పే స్కేలు అమలు చేయాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా అమలు చేయాలి.
- ప్రభుత్వ నియామకాలలో వెయిటేజీ కల్పించాలి.
- మహిళా ఉద్యోగులకు 180 రోజుల మెటర్నిటీ లీవ్స్ ఇవ్వాలి.
- పీటీఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగుల్లా 12 నెలల వేతనం చెల్లించాలి.

### హామీని నిలబెట్టుకోవాలి



మా ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని గతంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలి. పే స్కేల్ అమలు చేయాలి. మా డిమాండ్లపై ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మె చేస్తాం. – సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం

### సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నాం. మా సమస్యలను సర్కారు పరిష్కరించాలి. జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలి. మహిళా ఉద్యోగులకు 180 రోజులు మెటర్నిటీ లీవ్స్ ఇవ్వాలి. – వాసంతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం

### డిమాండ్లను నెరవేర్చాలి



విద్యాశాఖలో మేం వెట్టి చాకిరి చేస్తున్నాం. చాలీచాలని వేతనాలతో ఏళ్లుగా పనిచేస్తున్న మమ్మల్ని క్రమబద్ధీకరించాలి. విద్యాశాఖలో సమగ్ర శిక్ష అభియాన్‌ను విలీనం చేయాలి. మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. – సంతోష్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం

# రూ 3.5 కోట్ల మత్తు పదార్థాల దహనం

**జక్రాన్‌పల్లి:** జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలోని శ్రీమెడికేర్ సర్వీసెస్‌లో సోమవారం సుమారు రూ. 3.5 కోట్ల విలువైన మత్తుపదార్థాలను ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. జిల్లా డీసీ ఆదేశాల మేరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ స్టేషన్‌ల పరిధిలోని 60 కేసులలో పట్టుబడిన వివిధ రకాల మత్తుపదార్థాలను దహనం చేశారు. 1007.02 కిలోల ఎండు గంజాయి, 35 కిలోల గంజాయి చాక్లెట్లు, 7 కిలోల డైజోపామ్, 8 కిలోల ఆల్ప్రాజోలం, రెండు గంజాయి మొక్కలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.



## క్లుప్తంగా

### సైన్స్ ఫెయిర్‌లో చిన్నమల్లారెడ్డి విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి రూరల్: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 6,7వ తేదీల్లో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫెయిర్), ఇన్‌స్పైర్ ప్రదర్శనలో ఫుడ్ హెల్త్ అండ్ హైజీన్‌కు సంబంధించి జూనియర్ విభాగంలో కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయి చరణ్, నందీశ్వర్లు ప్రదర్శించిన టీచర్ స్టూడెంట్ ఫ్రెండ్లీ డస్టర్ అనే అంశం జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికై ంది. అలాగే రిసోర్స్ మేనేజ్మెంట్ విభాగంలో సీనియర్స్ నుంచి నివేదిత, నిఖిల ప్రదర్శించిన పర్యావరణ కాలుష్యంపై అంశం జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అయితే వీరికి గైడ్ టీచర్‌గా పాఠశాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

### 'ఇందిరమ్మ ఇళ్ల' సర్వే చేయలేం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో తాము ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేమని పేర్కొంటూ నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు సోమవారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగపరంగా తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు చెప్పారు. సర్వేలో భాగంగా ప్రవేశపెట్టిన యాప్‌లో రిజెక్ట్, ఎలిజిబుల్ అనే ఆప్షన్ ఉందని, దీనివల్ల తాము ఎవరినైనా రిజెక్ట్ చేస్తే తమపై భౌతికదాడులకు పాల్పడే అవకాశముందన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి వారితో సర్వే జరిపించాలని, వారికి తాము సహకరిస్తామని చెప్పారు.

### నిత్యం రామనామాన్ని జపించాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ రామ నామాన్ని జపించాలని దీని వల్ల వారి జీవితం సుఖమయం అవుతుందని సాధుపరిషత్ కార్యదర్శి కృష్ణానంద స్వామీజీ అన్నారు. ఆయన సోమవారం భిక్కనూరులో రామనామ జపం విశిష్టత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భగవంతుడికి సేవ చేసేందుకు తగిన సమయాన్ని కేటాయించుకోవాలన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచి భక్తి భావం గురించి వివరిస్తే వారు మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు.

### కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. ఆదివారం నాటికి 87 వేల 762 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు తెలిపారు.



# ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్
- ప్రజావాణికి 68 వినతులు



బారులు తీరిన ఫిర్యాదుదారులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 28 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందినవి. 10 జిల్లా పంచాయతీరాజ్ శాఖకు, 7 వ్యవసాయ, 6 గృహ నిర్మాణ, 4 మున్సిపల్ మిగితావి వేరే శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. తమ పరిధిలో లేకుంటే పరిష్కార మార్గాలు చూపాలన్నారు. లేదంటే ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రైస్‌మిల్లుపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గాంధారి గ్రామస్తులు

జనావాసాల మధ్యనున్న రైస్‌మిల్లు కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, ఆ రైస్‌మిల్లుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గాంధారి మండల కేంద్రానికి చెందిన పలువురు గ్రామస్తులు ప్రజావాణికి తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. గాంధారిలో పశువైద్యశాల ఎదురుగా తిరుమల రైస్‌మిల్లు ఉందన్నారు. దాని చుట్టూ నివాస గృహాలు ఉన్నాయని తెలిపారు. మిల్లు నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా దుమ్ము, ధూళితో తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

### తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. గ్రామాలలో ఏమైనా సమస్యలున్నట్లయితే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

### పిట్లంలో ప్రజావాణి



పిట్లం(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ వేణు గోపాల్ పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఏమైని సమస్యలు ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేవని తెలిపారు. ఎంపీడీవో కమలాకర్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### రాజంపేటలో 5 దరఖాస్తులు



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

రాజంపేట: మండల స్థాయిలో ప్రజావాణికి వచ్చిన 5 దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించినట్లు మండల తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభించాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో రఘురాం, ఎంఈవో పూర్ణ చందర్, ఏవో శృతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



తాడ్కోల్‌లో పొగమంచు కమ్మేయడంతో కనపడని రహదారి



లింగంపేట మండల కేంద్రంలో సోమవారం ఉదయం 8 గంటలకు..

## రహదారులను కమ్మేసిన పొగమంచు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలాన్ని సోమవారం ఉదయం పొగమంచు కప్పేసింది. ఆయా గ్రామాల్లోనూ ఉదయం 8 గంటల వరకు పొగమంచు పరుచుకుంది. ఎదురెదురుగా తారసపడినా ఒకరికొకరు కన్పించలేనంత దట్టంగా పొగమంచు కమ్ముకుంది. పొగమంచుతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో మంచు దుప్పటి కమ్ముకుంది. ఉదయం 9 గంటలకు సైతం ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వాహన చోదకులకు రోడ్డు కనిపించక ఇబ్బంది పడ్డారు. యువకులు, వాహన చోదకులు, ప్రజలు పొగమంచును తమ సెల్ ఫోన్లలో బంధించి సంబరపడ్డారు.

క్రైం కార్నర్

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- మూలమలుపులో హోటల్ ముందు వాహనాలు నిలపడంతో ఘటన
- హోటల్‌ను తొలగించాలని గ్రామస్తుల ధర్నా



మహ్మద్ ఆరిఫ్ (ఫైల్)



ధర్నా చేస్తున్న పొందుర్తి గ్రామస్తులు

రాజంపేట: మండలంలోని పొందుర్తి వద్ద జాతీయ రహదారి 44పై బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి..పొందుర్తికి చెందిన మహ్మద్ ఆరిఫ్ (39) ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా హైవేపై ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరిఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎన్‌హెచ్ 44పై ధర్నా చేశారు. హైవేపై ఉన్న పెట్రోల్ పంప్‌ను ఆనుకుని పొందుర్తి మూలమలుపు వద్ద హోటల్ ఏర్పాటు చేయడంతో అక్కడ వాహనాలను నిలుపుతున్నారని, ఈ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు హోటల్ యజమానిని హెచ్చరించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజు ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులను సముదాయించడంతో వారు ఆందోళన విరమించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని ఎస్సై అన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### చిరుత దాడిలో దూడ మృతి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ అటవీప్రాంతంలో దూడపై చిరుత దాడి చేసినట్లు స్థానికులు సోమవారం తెలిపారు. గ్రామంలోని నిమ్మ సత్యనారాయణకు చెందిన లేగ దూడను పొలంలో కట్టి వేశాడు. సోమవారం ఉదయం వెళ్లిన సమయంలో దూడ మృతి చెంది ఉంది. చిరుత దాడి చేయడంతో దూడ మృతి చెందిందని సత్యనారాయణ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు చిరుతదాడేనని ధృవీకరించారు. చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజామాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మోపాల్ మండలం శ్రీరాంసాగర్ తండాకు చెందిన బామన్ జైల్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా బ్యాగులో సమారు 210 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



ధర్పల్లి: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి నివాసపు గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గోసంగి కాలనీకి చెందిన సంపంగి సాయవ్వ తన మనవరాళ్లతో కలిసి పూరిగుడిసెలో జీవిస్తోంది. ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు గుడిసెకు మంటలు అంటుకోవడంతో సాయవ్వ తన మనవరాళ్లతో కలిసి బయటికి పరుగు తీసి కేకలు వేసింది. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పివేసినప్పటికీ అప్పటికే అందులోని నగదు, సామగ్రి దగ్ధమైంది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితురాలు బోరున విలపించింది. ఘటన స్థలాన్ని ఆర్‌ఐ రాజేశ్వర్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.40వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. మాజీ ఎంపీపీ సారికాహనుమంత్‌రెడ్డి, రాజ్‌పాల్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

### ఆవులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

నందిపేట్(ఆర్మూర్): అక్రమంగా ఆవులను తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మండల కేంద్రంలోని చింరాజ్‌పల్లి గ్రామ కమాన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా వ్యాన్‌లో ఆవులు కనిపించాయి. డొంకేశ్వర్ మండల కేంద్రం నుంచి నవీపేట మండలం నీలా గ్రామానికి అక్రమంగా రెండు ఆవులు, రెండు గేదెల ను తరలిస్తున్నట్లు తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులైన మహ్మద్ మక్బర్, ఎస్‌కే ఆదిత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

**పీడీఎస్ బియ్యం..**

ఎడపల్లి (బోధన్): నిజామాబాద్ వైపు నుంచి బోధన్ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వంశీ చందర్‌రెడ్డి తెలిపారు. ఎడపల్లి శివారులో డీసీఎంను తనిఖీ చేయగా 74 సంచుల పీడీఎస్ బియ్యం పట్టుబడిందన్నారు. డీసీఎం డ్రైవర్ అబ్బాస్‌పై కేసు నమోదు చేశామన్నారు.

### హోటళ్లు, దాబా నిర్వాహకులకు జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ పరిధిలో సమయపాలన పాటించకుండా నడిపిస్తున్న పలు దాబాల, హోటళ్ల యజమానులను బోధన్ కోర్టులో సోమవారం హాజరుపర్చగా సెకండ్ క్లాస్ న్యాయమూర్తి శేషసాయి తల్ప వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణ పరిధిలోని కిసాన్‌దాబా, చాందిని దాబా, స్ప్రింగ్ బేకరీ, అన్సార్ హోటల్ యజమానులు సమయపాలన లేకుండా రాత్రి వేళల్లో తమ హోటళ్లు, దుకాణాలను తెరిచి ఉంచారన్నారు. రాత్రి 10.30గంటల్లోగా వ్యాపార సముదాయాలు, హోటళ్లు, దుకాణాలను మూసివేయని వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

### డయల్ 100 దుర్వినియోగం.. వ్యక్తికి జైలు శిక్ష

నవీపేట: తాగిన మైకంలో పదేపదే డయల్ 100కు కాల్‌చేసిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. మండలంలోని బినోల గ్రామానికి చెందిన బోసి హన్మాండ్లు గత శుక్రవారం తాగిన మైకంలో 100 డయల్‌కు కాల్ చేశాడు. ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామానికి వెళ్లగా ఎటువంటి ఫిర్యాదు అందలేదు. దీంతో డయల్ 100ను దుర్వినియోగం చేసిన వినయ్‌పై కేసు నమోదు చేసి జిల్లా కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

# రూ.10 కాయిన్ చెల్లుతోంది..



రామారెడ్డి: కొన్నేళ్ల క్రితం రూ.10 నాణాన్ని కిరాణా, ఇతర వ్యాపారులు తీసుకోవడానికి జంకేవారు. ఆర్బీఐ రూ.10 నాణాలను నిషేధించిందని పుకార్లు రావడంతో వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. ఆర్‌బీఐ రూ.10 నాణెం చెల్లుబాటు విషయంలో అనేకసార్లు వ్యాపారులు, బ్యాంకర్లు, ప్రజలకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. రూ.10 నాణాలు చెల్లుబాటవుతాయని.. రద్దు చేశారంటూ అపోహలు వ్యాపింప చేయడం చటారీత్యా నేరమని కూడా హెచ్చరించింది. అయినా వ్యాపారులు, ప్రజల తీరులో మార్పు మాత్రం రాలేదు. కానీ ఈ ఏడాది ప్రారంభం నుంచి మార్కెట్‌లో కొత్త పది, ఇరవై రూపాయల నోట్ల కొరత ఏర్పడింది. దీని కారణంగా వ్యాపారులు, ప్రజల్లో మార్పు మొదలైంది. పాత పది, ఇరవై నోట్లు తీసుకుని నష్టపోవడం కన్నా కొత్త పది రూపాయల నాణేం తీసుకోవడం మేలని భావించి పది రూపాయల కాయిన్ తీసుకోవడానికి ముందుకొస్తున్నారు. అందరూ ఇచ్చి పుచ్చుకోవడంతో సమస్య పరిష్కారమైంది.

**తీసుకుంటున్నాం..**

రూ.10, రూ.20 కాయిన్లను తీసుకుంటున్నాం.. ఇస్తున్నాం. ఈ ఏడాదిలో మొదట్లో ప్రజలు ఇస్తే తీసుకున్నారు. మళ్లీ మా దగ్గరకే తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఎక్కడైనా తీసుకుంటున్నారు.

–పోగుల ప్రమీల, కిరాణా షాపు, రామారెడ్డి

## జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షకు విద్యార్థుల ఎంపిక



మాచారెడ్డి: మండల స్థాయి బయో సైన్స్ ప్రతిభా పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ఆంగ్ల మాధ్యమం విభాగంలో మాచారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన సభా తబస్సుం ప్రథమ, లచ్చాపేట ఉన్నత పాఠశాలకు చెందిన నిఖిత ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే తెలుగు మీడియంలో చుక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.రాంచరణ్ ప్రథమ, పి.రాంచరణ్ ద్వితీయ శ్రేణిలో ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దేవేందర్ రావు, మాచారెడ్డి హెచ్ఎం వెంకటాచారి, బయో సైన్స్ మండల ఆర్గనైజర్ యాదాగౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

**రామారెడ్డి నుంచి..**



రామారెడ్డి: మండల స్థాయి బయోసైన్స్ ప్రతిభా పరీక్షలో వర్ష అనే విద్యార్థిని సత్తా చాటి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికైనట్లు రెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గోపాల్ రెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు,గ్రామస్తులు అభినందించారు. ఎంఈవో ఆనంద్‌రావు, ఉపాధ్యాయులు చిన్నస్వామి, సంతోష్, పాల్గొన్నారు.

**మహమ్మద్‌నగర్ నుంచి..**



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం బయోసైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మహమ్మద్‌నగర్ ఉన్నత పాఠశాలకు చెందిన మమత ప్రథమస్థానం, ముబీనా కొమలంచ, నిహారిక సింగితం ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలను అందజేశారు.

**రాజంపేట నుంచి..**

రాజంపేట: మండల స్థాయిలో బయోసైన్సు ప్రతిభ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో పూర్ణచంద్రరావ్ అభినందించారు. ఇంగ్లీష్ మీడియంలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో డి.ప్రణీత్(రాజంపేట) ప్రథమ స్థానం, ఎం.యోగేష్(కొండాపూర్) ద్వితీయ స్థానం సాధించారు. తెలుగు మీడియంలో బి.తరుణ్ (గుండారం), ఎస్‌డీ సనీమ(ఆర్గొండ) ద్వితీయ స్థానం సాధించారు.



**ఎల్లారెడ్డి నుంచి..**



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ జెడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయిలో బయోసైన్సు ప్రతిభా పరీక్ష నిర్వహించినట్లు ఎంఈవో వెంకటేశం సోమవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో అడివిలింగాల జెడ్పీ పాఠశాలకు చెందిన అజయ్ ప్రథమ బహుమతి సాధించగా, గురుకుల పాఠశాలల విభాగంలో మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు మానస, అక్షరలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు ఎంఈవో తెలిపారు. అడివిలింగాల జెడ్పీ పాఠశాల ప్రిన్సిపల్ శివనర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**దోమకొండ లో..**



దోమకొండ: దోమకొండ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి బయోసైన్స్ ప్రతిభ పరీక్షలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ సోమవారం తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో భవాని రెండు బహుమతులలో మొదటి స్థానం, తెలుగు మాధ్యమంలో పల్లవి రెండు బహుమతులను కైవసం చేసుకున్నారన్నారు. విద్యార్థినులతో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు ప్రభావతి, లక్ష్మీలను అభినందించారు.

## నాలుగో రోజు కొనసాగిన దీక్షలు



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపడుతున్న నిరసన దీక్షలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం ముందు చేపడుతున్న దీక్షా శిబిరం నుంచి తెలంగాణ పోరాట అమరవీరుల ఫొటోల ఫ్లెక్సీతో కొత్త బస్టాండ్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షులు వాసంతి, కోశాధికారి భాను, నాయకులు శీనివాస్, శ్రీధర్ కుమార్, రాములు, యోగేశ్వర్, సంతోష్ రెడ్డి, వనజ, శైలజ, భీమన్న, మాధవి, కాళిదాస్, కృష్ణ, గంగ ప్రసాద్, బన్సీలాల్, లింగం, దినేష్ పాల్గొన్నారు.

## తాగిన మైకంలో ఉరేసుకొని ఆత్మహత్య

నవీపేట: మండలంలోని శివతండాకు చెందిన గొండ బాబు(30) తాగిన మైకంలో సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మద్యానికి బానిసైన బాబు తరచూ భార్య మమతతో గొడవపడేవాడని పేర్కొన్నారు. ఈనెల 5న తాగిన మైకంలో భార్యను కొట్టడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. ఒంటరిగా ఇంట్లో ఉంటున్న బాబు తాగిన మైకంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**మద్యానికి బానిసై వృద్ధుడు..**

భిక్కనూరు: మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన వృద్ధుడు మద్యానికి బానిసై మతిస్థిమితం సరిగా లేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. కలెట్ల ఎల్లయ్య (74) తన భార్య లక్ష్మితో కలిసి ఉంటున్నాడు. వారి పిల్లలు గతంలోనే మృతి చెందారు. మద్యానికి బానిసైన ఎల్లయ్య తరచూ భార్య లక్ష్మితో గొడవపడేవాడు. ఈనెల 6వ తేదీన కూడా భార్యతో గొడవ పడడంతో ఆమె హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరుడి వద్దకు వెళ్లిపోయింది.ఒంటరిగా ఉంటు న్న ఎల్లయ్య సోమవారం ఉదయం తన ఇంటి ఎదుట ఉన్న జామ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కెనాల్‌లో ట్రాక్టర్ బోల్తా



నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం చిన్నతాడెం గ్రామ శివారులోని కెనాల్‌లో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. న్యాల్‌కల్ నుంచి మోపాల్ మండల కేంద్రానికి వస్తున్న ట్రాక్టర్ చిన్నతాడెం గ్రామ శివారులోని కెనాల్ వంతెన పైనుంచి పడిపోయిందన్నారు. ఈ ఘటనలో పోతన్న, దశరథ్ అనే ఇద్దరికి గాయాలయ్యాయన్నారు.

### ఇసుక డంప్ స్వాధీనం



రుద్రూర్: మండలంలోని రాయకూర్ శివారులోని గుట్ట ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను అధికారులు సోమవారం గుర్తించారు. పక్కా సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీరుద్దీన్ రెవెన్యూ సిబ్బందితో వెళ్లి ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశారు. సుమారు 22 ట్రాక్టర్ల ఇసుక ఉందని తెలిపారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో ఇసుక డంప్‌లను అక్కడి అధికారులు సీజ్ చేసి వేలం వేస్తుండడంతో అక్రమార్కులు గుట్టల వైపు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.